
సాక్షి
ఒడిశా

బుధవారం । 1 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.3,37,168
బంగారం 100 మిల్లీ గ్రాములు
వెండి 18 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



బారులుతీరిన జనం

స్థానిక భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శాఖ ఆవరణలో మంగళవారం నోట్లు మార్చుకోవడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు బారులుతీరారు.

- 8లో



భారీగా మందుగుండ సామగ్రి పట్టివేత

జట్నీ ఠాణా పరిధిలో పోలీసులు చేపట్టిన ఆకస్మిక దాడిలో భారీ స్థాయిలో బాణాసంచా స్వాధీనం చేసుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ఐదుగురు దుండగులు అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: రెండు రోజుల క్రితం నగరానికి సమీపంలోని లంజియాపల్లి గ్రామంలో కరుడుగట్టిన నేరస్తుడు దునియా సాహు హత్య కేసుకు సంబంధించి ఐదుగురు నేరస్తులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఐఐసీ అధికారి రేవతి సబర్ తెలిపిన వివరాల మేరకు.. సదర్ పోలీసుస్టేషన్ పరిధి లంజియాపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం కరుడుగట్టిన నేరస్తుడు దునియా సాహుపై దుండగులు మారణయుధాలతో దాడిచేసి పరారయ్యారు. జరిగిన హత్య సంఘటనపై సదర్ పోలీసులు కేసు నమోదు చేసి హత్యకు సంబంధించి ఐదుగురు దుండగులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో టంకరపడా గ్రామానికి చెందిన దుర్యోధన్ ప్రదాన్, కుర రౌలో, బింకు జెన్న, టిక్కరపడా గ్రామానికి చెందిన సురేష్ బెహరా, సాగర్ ప్రదాన్‌లు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. మంగళవారం బరంపురం ఎస్‌డీజేఎం కోర్టులో హాజరుపరిచి నిందితులను జైలుకి తరలించారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముదులి

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రక్తదానం మహత్తర దానమని ఆయన పేర్కొన్నారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడేందుకు అవసరమయ్యే రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. శిబిరంలో 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. క్లబ్ అధ్యక్షురాలు కె.శోభారాణి నేతృత్వంలో జరిగిన శిబిరంలో సభ్యులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యానికి మేలు



ర్యాలీలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

రాయగడ: నడకతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ అల్వారి దాస్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సాయిప్రియ మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. బాలాజీ స్వీట్స్ దుకాణం నుంచి ప్రారంభించిన నడక రిలియన్స్ మార్ట్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు లాడి మురళి, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ అధికారుల పునర్వ్యవస్థీకరణ

భువనేశ్వర్: ఐపీఎస్ కేడర్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం 1988 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి అరుణ్ కుమార్‌ను ప్రింటింగ్, స్టేషనరీ అండ్ పబ్లికేషన్ ఒడిశా, కటక్ డైరెక్టర్‌గా నియమించింది. అతను ప్రస్తుతం హోం శాఖ ఓఎస్‌డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, మానవ హక్కుల పరిరక్షణ సెల్ (హెచ్‌ఆర్‌పీసీ) స్పెషల్ డీజీపీగా పని చేస్తున్న ఎ.ఎం.ప్రసాద్‌ను బదిలీ చేసి జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్, డైరెక్టర్ కరెక్షనల్ సర్వీసెస్‌గా నియమించినట్లు హోం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రెస్ డైరెక్టర్ లలిత్ దాస్ మానవ హక్కుల పరిరక్షణ సెల్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ చేయబడ్డారు. 2008 బ్యాచ్ అధికారి ఉమా శంకర్ దాష్ డీఐజీ, ఎస్‌ఐడబ్ల్యూగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన భువనేశ్వర్ – కటక్ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ సీపీగా ఉన్నారు. పోలీస్ కమిషనరేట్ అడిషనల్ సీపీగా ఉమాశంకర్ దాష్ స్థానంలో డీఐజీ (హెడ్ క్వార్టర్స్) బ్రిజేష్ కుమార్ రాయ్ నియమితులయ్యారు.

రాష్ట్ర గవర్నర్‌గా రఘుబర్ దాస్

- 26వ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రముఖులు



గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న రఘుబర్ దాస్

భువనేశ్వర్: ఒడిశా రాష్ట్ర 26వ గవర్నర్‌గా రఘుబర్ దాస్ మంగళవారం ఉదయం స్థానిక రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఒడిశా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి బిద్యుత్ రంజన్ షడంగి ఉదయం 11.45 గంటలకు ఆయనతో విధేయత మరియు పదవీ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. కొత్త గవర్నర్ కుటుంబ సభ్యులు, జార్ఖండ్‌కు చెందిన బంధువులు మరియు మద్దతుదారులు కూడా హాజరయ్యారు. అనంతరం రాజ్‌భవన్‌లో నూతన గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. ఆయన ఒడిశా గవర్నర్‌గా ప్రొఫెసర్ గణేషి లాల్ స్థానంలో నియమితులయ్యారు. రఘుబర్ దాస్‌ను ఒడిశా కొత్త గవర్నర్‌గా అక్టోబర్ 18న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. ఈ నియామకానికి ముందు, ఆయన బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. అతను 2014 నుంచి 2019 సంవత్సరం వరకు జార్ఖండ్‌కు మొదటి గిరిజనేతర ముఖ్యమంత్రిగా పాలన పగ్గాలు చేపట్టి విజయవంతంగా పనిచేశారు.

ముఖ్యమంత్రి అభినందనలు

రాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రఘుబర్ దాస్‌ను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభినందించారు. అతని పదవీకాలం విజయవంతమై ఫలప్రదం కావాలని ఆకాంక్షించారు. రఘుబర్ దాస్ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో కలిసి 23 సంవత్సరాల నిరంతరాయ పదవీకాలంలో పనిచేయనున్న 9వ గవర్నర్ కావడం విశేషం. నవీన్ పట్నాయక్‌తో కలిసి గవర్నర్‌గా పనిచేయనున్న రెండో మాజీ ముఖ్యమంత్రి ఆయన. 2013 నుంచి 2018 సంవత్సరం వరకు గవర్నర్‌గా కొనసాగిన డాక్టర్ ఎస్.సి.జమీర్ నాగాలాండ్ మాజీ ముఖ్యమంత్రి. ఆయన 5 సార్లు నాగాలాండ్ ముఖ్యమంత్రిగా పాలన పగ్గాలు చేపట్టిన రాజకీయ నాయకునిగా పేరొందారు.



కొత్త గవర్నర్‌ను అభినందిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

వణికిస్తున్న చలిపులి

- కొరాపుట్ జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రత
- నవంబర్ 3 వరకు తేలికపాటి వర్ష సూచన

భువనేశ్వర్: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు మరియు ఉత్తర ప్రాంతాల ప్రజలు శీతాకాలపు చలిని చవి చూస్తున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకారం తీరప్రాంత రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో గత 24 గంటల్లో రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు దిగజారింది. చాలా నగరాల్లో రాత్రి ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉంది. ఐఎండీ ప్రకారం ఈ నెలలో అత్యల్ప ఉష్ణోగ్రత కంధమల్ జిల్లా జి.ఉదయగిరిలో నమోదైంది. మంగళవారం పలుచోట్ల పొగమంచు కారణంగా దృశ్యమానత తగ్గింది. కొరాపుట్ జిల్లా సెమిలిగుడలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత 12.2 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. కొరాపుట్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 12.8 డిగ్రీల సెల్సియస్ వద్ద రెండవ స్థానంలో ఉంది, తదుపరి స్థానాల్లో కంధమల్ జిల్లా దారింగ్‌బాడి మరియు జి.ఉదయగిరి ప్రాంతాల్లో చలి తీవ్రత అధికంగా నమోదు అయింది. దారింగ్‌బాడి ప్రాంతంలో 13 మరియు జి.ఉదయగిరిలో 13.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదు అయింది. కంధమల్ జిల్లా ఫుల్బాణిలో 15.1 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. జంట నగరాలైన భువనేశ్వర్ మరియు కటక్‌లలో సాధారణ రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రత క్రమంగా 20.2 మరియు 20 డిగ్రీల సెల్సియస్ రికార్డు అయింది. కొద్దిరోజుల పొడి వాతావరణం తర్వాత బంగాళాఖాతంలో అలల తూర్పు వైపు కదలిక ప్రభావంతో నవంబర్ 1 నుంచి రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతం నుంచి తూర్పు గాలులు రాష్ట్రంలోకి వీస్తున్నందున మంగళవారం నుంచి దక్షిణ ఒడిశాలో వాతావరణం మారుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఈ అంచనా ప్రకారం చాలా చోట్ల వాతావరణం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. గంజాం, గజపతి, రాయగడ, మల్కన్‌గిరి, కొరాపుట్, నవరంగ్‌పూర్, కలహండి, కంధమల్ జిల్లాల్లో నవంబర్ నెల 3వ తేదీ వరకు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ప్రమాదంలో దుర్మరణం చెందిన తులా గౌఢ

జయపురం: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం చెందాడు. మరణించిన వ్యక్తి కోట్‌పాడ్ సమితి కుర్మికోట్ గ్రామానికి చెందిన తులా గౌఢ(35)గా గుర్తించారు. జయపురం సదర్ పోలీసుస్టేషన్‌లో ఈ ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపించారు. పోస్టుమార్టం అనంతరం అతడి బంధువులకు మృతదేహం అప్పగించినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో తులా గౌఢ తన ద్విచక్ర వాహనంపై బొరగాం గ్రామం నుంచి కుర్మికోట్ వెళ్తున్నాడు. ఈ సమయంలో జయపురం–కుంద్ర మార్గంలో దొలయ్‌పుట్ బ్రిడ్జి సమీపంలో అదుపు తప్పి బైక్ ఒక పోల్‌కు ఢీకొంది. సమాచారం అందిన జయపురం సదర్ పోలీసులు రక్తపు మడుగులో పడి ఉన్న తులా గౌఢను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన డాక్టర్లు తులా అప్పటికే మరణించినట్లు వెల్లడించారు. ఈ విషయం తెలిసిన మృతుని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. గగణాపూర్ పోలీసు పంటి అధికారి రాజకిశోర్ బారిక్ కేసు దర్యాప్తు జరుపుతున్నారని ఈశ్వర తండి వెల్లడించారు.

లింగరాజు సన్నిధిలో రఘుబర్ దాస్



ప్రమాణ స్వీకారోత్సవానికి కొన్ని గంటల ముందు ఒడిశా గవర్నర్‌గా నియమితులైన రఘుబర్ దాస్ మంగళవారం స్థానిక ఏకామ్ర క్షేత్రంలో లింగరాజ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రం ఆరాధ్య దైవం లింగరాజు మహాప్రభువుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. లింగరాజు ఆలయ ప్రాంగణానికి ముందస్తుగా చేరిన పలువురు బీజేపీ నేతలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. – భువనేశ్వర్

క్రీడల్లో యువత రాణించాలి



ఆదివాసీ కళాకారుతో కలసి డాన్స్ చేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి



విజేతలతో సందడి చేస్తున్న ఎమ్మెల్యే

జయపురం: విద్యతో పాటు క్రీడల్లో యువత రాణించాలని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పిలుపునిచ్చారు. కొరాపుట్ జిల్లా మస్తిపుట్ గ్రామ పంచాయతీ మస్తిపుట్‌లో ది లెజెండ్స్ ఆఫ్ మస్తిపుట్ వారు మంగళకాకం నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్ పోటీకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి తోడ్పడతాయని తెలియజేశారు. యువతలో మంచి స్నేహ సంబంధాలు నెలకొల్పుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో కొరాపుట్ జిల్లా ఫుట్‌బాల్ ఆటలో అత్యంత పేరు గాంచిందని గుర్తు చేశారు. ఏ పోటీలోనైనా అందరూ విజేతలు కాలేరని, ఓటమి చెందిన వారు మరింత సాధనతో ముందుకెళ్లాలని సూచించారు. ఫైనల్‌లో చంపాపొదర్, గొడగుడ టీమ్‌లు సమర్ధవంతంగా ఆడినా చంపాపొదర్ టీమ్, గొడగుడ టీమ్‌ను 5–4 గోల్‌లతో ఓడించి విన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో కొరాపుట్ సమితి చైర్మన్ నమిత మఝి, వైస్ చైర్మన్ శివ గొల్లారి, కృష్ణ కులదీప్, బిరాజ్ బెనియ, జగదీష్ ఖోశ్ల తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ అధికారుల దాడులు



హార్డ్‌వేర్ షాపులో దాడులు నిర్వహిస్తున్న జీఎస్టీ అధికారులు



స్టాక్ వివరాలు సేకరిస్తున్న సిబ్బంది



షాపు బయట పోలీసులు బందోబస్తు

రాయగడ: స్థానిక గజపతి కూడలి సమీపంలోని ఒక హార్డ్‌వేర్ షాపులో జీఎస్టీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. రాయగడ రీజనల్ కార్యాలయం డిప్యూటీ కమిషనర్ టి.బిమల్ నేతృత్వంలో ఒక బృందం ఈ దాడులను చేపట్టింది. షాపు బయట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి లోపలికి ఎవరినీ అనుమతించకుండా అధికారులు దాడులను నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటుగా చేపట్టిన దాడుల్లో పలు కీలకమైన వ్యాపార లావాదేవీలకు సంబంధించిన ఫైల్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా షాపులోని స్టాక్ వివరాలను అధికారులు పరిశీలించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

సమస్యలు పరిష్కరించండి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన యూనియన్ నేతలు

జయపురం: స్థానిక సేవా పేపరు మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు కొరాపుట్ కలెక్టర్‌కు ఉద్దేశించిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలలుగా మిల్లులో ఉత్పాదన ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముడి సరుకులు కొరత కారణంగా చెబుతూ మిల్లులో పేపర్ ఉత్పాదన జూలై 14 నుంచి యాజమాన్యం నిలిపి వేసిందని, దీంతో నాలుగు నెలలుగా ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. కార్మికులకు కేవలం 4 నెలల జీతాలే కాదని, గతంలో 20 నెలల జీతాల బకాయిలు చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆరోపించారు. లేబర్ అధికారులు కలగజేసుకున్నా సమస్య పరిష్కారం కాలేదని వివరించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు ప్రమోద్ కుమార్ మహంతి, కేదార్ ఆచార్య, నారాయణ దాస్, చక్రధర మల్లిక్, ప్రదీప్ కుమార్ పంజియ, బనమాలి పాత్రో, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుణుపూర్‌లో అగ్ని ప్రమాదం

- ఒకరు మృతి
- ఇద్దరికి గాయాలు



ప్రభాతి మృతదేహం



మంటల్లో దగ్ధమవుతున్న ఇల్లు



మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి



గాయాలతో చికిత్స పొందుతున్న సూర్యప్రకాష్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక వృద్ధురాలు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయాలైన వారిలో ఒక చిన్నారి కూడా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. గుణుపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయానికి సమీపంలోని ఒక బస్తీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీనిలో భాగంగా ప్రభాతి సునాపల్లి(50) అనే వృద్ధురాలు మంటల్లో చిక్కుకుని తీవ్రగాయాలకు గురయ్యింది. అదేవిధంగా అదే బస్తీలో గల సూర్యప్రకాష్ సునాపల్లి (53), అన్సూరీ దేనార్ (7) అనే చిన్నారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా, చికిత్స పొందుతూ ప్రభాతి సునాపల్లి అనే వృద్ధురాలు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గాయలపాలైన మరో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వివరించారు. ప్రమాదం సంభవించిన ప్రాంతానికి సబ్ కలెక్టర్ లలిత్ కుమార్ కుహరో, తహసీల్దార్ లీలావతి ఆచార్య, అదనపు తహసీల్దార్ అంశుమాన్ పొరిడ, అదనపు కలెక్టర్ సత్యజీత్ నాయక్‌లు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

'ఈ-శ్రమ్ లక్ష్యాన్ని చేరుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రేషన్ కార్డుల కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస, అసంఘటిత కార్మికులకు కార్డులు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. ఆయన తన చాంబర్‌లో మంగళవారం ఉదయం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా 6,12,408 మంది కార్మికుల నమోదు లక్ష్యంగా నిర్ణయించామని, ఇప్పటి వరకూ 4,91,852 మంది కార్మికుల నమోదు పూర్తయిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 80.31 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని, మిగిలిన వారి నమోదు కోసం విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ-శ్రమ్‌లో నమోదైన వివరాలు వచ్చిన వెంటనే రైస్ కార్డులు లేని వారికి కార్డులు ఇవ్వాలని సంబంధిత అధికారులను సూచించారు.

1 నుంచి 3 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: నవంబరు 1 నుంచి 3 వరకు కోర్టు విధులు బహిష్కరించనున్నట్టు బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం బార్ అసోసియేషన్ భవనంలో న్యాయవాదులు బార్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించిన తీర్మానాలపై సమావేశం నిర్వహించారు. అన్ని పిటిషన్‌ల మీద 20 రూపాయల వెల్ఫేర్ స్టాంప్‌ని అంటించాలని చేసిన అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ చట్ట సవరణను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయవాద సంక్షేమ నిధి నుంచి మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు ఇస్తున్న డెత్ బెనిఫిట్స్ రూ.నాలుగు లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం



వృద్ధురాలి మృతదేహం

జి.సిగడాం: సంతవురిటి సమీపంలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం రాజాం-పొందూరు ప్రధాన రహదారిలో వృద్ధురాలి మృతదేహం కనిపించింది. ఈమె బిచ్చమెత్తుకుంటూ గ్రామాల్లో తిరిగేదని, మతిస్థిమితం లేదని స్థానికులు తెలిపారు. స్థానిక హెచ్‌సీ పొగిరి శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మృతి దేహాన్ని రాజాం ప్రభుత్వాస్పత్రిలో ఉంచినట్లు తెలిపారు.


అర్హులందరికీ ఓటు హక్కు

కోటబొమ్మాళి: అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్తగా ఓటు హక్కు కల్పించాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల అధికారులు, బీఎల్‌ఓలతో సమీక్షించారు. తహశీల్దార్లు జామి ఈశ్వరమ్మ, చలమయ్య, డీటీ ఆర్.మధు, సీఎస్‌డీటీ కె.రాము, ఆర్‌ఐ శివ పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: పంచాయతీల్లో యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు తప్పనిసరిగా జరగాలని ఈఓపీఆర్డీ కేవీపీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. అన్ని రకాల అభివృద్ధి, రెవెన్యూ వసూళ్లు డిజిటల్ పేమెంట్ల ద్వారా జరగాలని అన్నారు.

ఆదర్శనీయుడు వల్లభాయ్ పటేల్



బరంపురం: ఆకట్టుకుంటున్న సత్య మహరణ తీర్చిదిద్దిన సైకత శిల్పం

బరంపురం: భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ యువతకు ఆదర్శనీయుడని రామ్ పాత్రో అన్నారు. స్థానిక కోర్టుపేట జంక్షన్‌లోని జగన్నాథస్వామి మందిర ప్రాంగణంలో ఉన్న సీనియర్ సిటిజన్ పార్క్‌లో పటేల్ యువజన సంఘం మరియు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రామ్‌పాత్రో మాట్లాడుతూ పటేల్ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ప్రహల్లాద్ పాణిగ్రహి, అశోక్ నిమాయ్, రజనీకాంత్ మండలి, భగవాన్ భూయ్యా, రాజేష్ మజ్జీ, మిట్టు బెహరా, అలేఖ్ సాహు, పూర్ణచంద్ర పాణి, పూజరి సంతోష్ మిశ్రా, మహేశ్వర్ పాణి తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఉన్న మల్కన్‌గిరి మహా విద్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ లింగరాజ్ మిశ్రో ఆధ్వర్యంలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బరంపురం: వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: ఐక్యతపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

భారీగా మందుగుండ సామగ్రి పట్టివేత



జట్నీ పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుగుండ సామగ్రి

భువనేశ్వర్: దీపావళికి ముందు అక్రమ బాణసంచా నిల్వలు మరియు అమ్మకాలపై పోలీసులు నిఘా పటిష్టం చేశారు. ఈ నేపథ్యంలో జట్నీ ఠాణా పరిధిలో పోలీసులు చేపట్టిన ఆకస్మిక దాడిలో భారీ స్థాయిలో బాణాసంచా స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పహరా నిర్వహణలో ఉన్న ఏఎస్‌ఐ రంభాబతి బరువా నేతృత్వంలో జట్నీ పోలీసుల బృందం పక్కా సమాచారం మేరకు కుసుమట్టి గ్రామంలో మారీఘ సాహి వద్ద ఒక ఇంటిపై ఆకస్మికంగా దాడి చేశారు. దీనిలో భాగంగా లైసెన్స్ లేకుండా అక్రమంగా మందుగుండ సామగ్రి నిల్వ చేసిన ఛబీంద్ర కుమార్ సుబుధి అలియాస్ ఛొబ్బీ (49), పవిత్ర సుబుధి అలియాస్ పొబ్బీ (46)లను అరెస్ట్ చేశారు. వీరి నుంచి భారీ మొత్తంలో బాణాసంచా స్వాధీనం చేసుకున్నారు. వీరికి వ్యతిరేకంగా ఇండియన్ ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ సెక్షన్ 9(బి)(1)(బి) మరియు ఒడిశా బాణసంచా మరియు లౌడ్ స్పీకర్ రెగ్యులేషన్ యాక్ట్-1985 సెక్షన్ 5 కింద కేసు నమోదు చేసినట్లు మూడో సబ్ డివిజన్ ఏసీపీ ప్రదీప్ కుమార్ రౌత్ తెలిపారు.

పెద్దపులి కోసం జాయింట్ ఆపరేషన్



సరిహద్దు గ్రామ ప్రజలను హెచ్చరిస్తున్న ఆంధ్రా, ఒడిశా అటవీశాఖాధికారులు

ఇచ్ఛాపురం రూరల్: పెద్దపులి జాడ కనుగొనేందుకు ఆంధ్రా, ఒడిశా అటవీ శాఖ అధికారులు జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. మంగళవారం కాశీబుగ్గ రేంజ్, ఒడిశా పాత్రపూర్ రేంజ్ అటవీశాఖాధికారులు జాయింట్ సెర్చింగ్ టీమ్‌గా ఏర్పడి అయ్యవారిపేట, లొద్దపుట్టి, జగన్నాథపురం, ఒడిశా పేటూరు, నొవగాం, కోగాం, శారదాపురం గ్రామాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. ఒడిశా ప్రాంతం గండాహతి నుంచి వచ్చిన ఈ పెద్దపులి పగలంతా సేద తీర్చుకొని, రాత్రి సమయాల్లో సంచరిస్తున్న నేపథ్యంలో ఒంటరిగా బయట తిరగరాదని హెచ్చరించారు. కాశీబుగ్గ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణం నాయుడు, ఒడిశా పాత్రపూర్ రేంజ్ అధికారి అభినాథ్ చౌదరీ, తరుసేశ్వర్ సబర్‌ల ఆధ్వర్యంలో డీఆర్‌ఓ రాము, ఎఫ్‌ఎస్‌ఓలు బీవీకె.రెడ్డి, ఆర్.రాఘవయ్య, జి.రాజేందర్, ఎఫ్‌బిఓలు డి.సురేష్ కుమార్, టి.వెంకటేష్, ఎ.రవికుమార్, ఎం.పోలయ్య, పి.సంతోష్, ఎ.బాబురావులు పాల్గొన్నారు.

కోరన్న, మంగన్నలకు ఘనంగా నివాళి



సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మందస: మండలంలోని కొండలోగాం పంచాయతీ కొయ్యాడూరు గ్రామంలో శ్రీకాకుళ పోరాట తొలి అమరులు కోరన్న, మంగన్న వర్ధంతి కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ నాయకుడు గొరకల బాలకృష్ణ మాట్లాడుతూ శ్రీకాకుళ సాయుధ గిరిజన పోరాటంలో అసువులు బాసిన కోరన్న, మంగన్నలు పోరాటాలకు చైతన్యదీపికలుగా మారారన్నారు. మణిపూర్‌లో కుకీ ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండకు కారకులైన మతోన్మాద శక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. అడవి బిడ్డల అస్తిత్వంపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలను నిర్మించాలన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ మాట్లాడుతూ ఉద్దానం, ఏజెన్సీలలో సాగవుతున్న జీడిపంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, 80 కిలోల బస్తాకు రూ.16వేలు ధరగా నిర్ణయించాలని, కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంఘం నాయకుడు సవర నారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కుమారన్న తనయుడు మల్లేశ్వరరావు ఎర్రజెండాను ఎగురవేశారు. సీపీఐఎంఎల్ నాయకుడు హేమ, ఏఐకెఎంఎస్ నాయకులు మాధవరావు, అప్పయ్య, ఐఎఫ్‌టీయు నాయకుడు గోపి, అరుణోదయ నాయకుడు కుత్తుం ఢిల్లీరావు, కారుణ్య, కృష్ణ, రమేష్, లక్ష్మి, వరలక్ష్మి, గీతాంజలి, పుణ్యవతి, గున్నమ్మ, చుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు ప్రతాప్ జెనా గైర్హాజరు



ప్రతాప్ కుమార్ జెనా

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన మహంగా జంట హత్యల కేసు విచారణ పురస్కరించుకుని సీనియర్ బిజూ జనతాదళ్ (బీజేడీ) ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ న్యాయ శాఖ మంత్రి ప్రతాప్ కుమార్ జెనా కోర్టుకు గైర్హాజరయ్యారు. ఆయనకు న్యాయస్థానం ముందస్తుగా సమన్లు జారీచేసి విచారణకు మంగళవారం కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. అయితే కటక్ జిల్లా సాలేపూర్‌లోని ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (జేఎంఎఫ్‌సీ) కోర్టుకు నిందిత ఎమ్మెల్యే వ్యక్తిగతంగా హాజరు కాకుండా, తన న్యాయవాది ద్వారా తన అభిప్రాయం దాఖలు చేశాడు. ఐపీసీ సెక్షన్ 205 ప్రకారం వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని జేఎంఎఫ్‌సీ కోర్టును అభ్యర్థించినట్లు అనుబంధ వర్గాలు తెలిపాయి. 2021 జనవరి 2వ తేదీన మహంగా మండలం భారతీయ జనతా పార్టీ నాయకుడు కులమణి బొరాల్ (75), అతని సహచరుడు దిబ్యసింగ్ బొరాల్ (80)లను మహంగా తహసీల్ జంకోటి గ్రామ సమీపంలో గుర్తు తెలియని దుండగులు నరికి చంపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రఫుల్ల బిస్వాల్ జిల్లాలోని టంగి గోవింద్‌పూర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఫిర్యాదుదారు, సాక్షులు మరియు అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలు, వాంగ్మూలాలను పరిశీలించిన తర్వాత, భారతీయ శిక్షాస్మృతి 302, 506, 120 – బి సెక్షన్ల కింద నేరాలకు ప్రతాప్ కుమార్ జునా శిక్షార్హమైన నిందితుడుగా కేసు నమోదు చేయబడిందని న్యాయస్థానం ధృవీకరించినట్లు సెప్టెంబర్ 25 ఉత్తర్వుల్లో పేర్కొంది.

బైక్ బోల్తా పడి వ్యక్తి మృతి



రామప్పడు (ఫైల్)

రణస్థలం: మండలంలోని తెప్పలవలస ఎస్సీ కాలనీకి చెందిన యాగాటి రామప్పడు (35) ద్విచక్రవాహనం బోల్తాపడి మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని తెప్పలవలసకు చెందిన యాగాటి రామప్పడు, లావేరు మండలంలోని లావేరు గ్రామానికి చెందిన తోట అప్పలరాజులు విజయనగరం పండగలకు సోమవారం రాత్రి బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పతివాడపాలెం ఫ్లై ఓవర్‌పై ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయారు. తీవ్ర గాయాలతో ఉన్న ఇద్దరిని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామప్పడు మృతి చెందారు. అప్పలరాజు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. వీరు పైడి భీమవరంలోని ఓ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నారు. మృతుడికి భార్య భవానీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఏఎస్‌ఐ సీహెచ్ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికునికి గాయాలు



విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతున్న పరపటి తమ్మయ్య

నందిగాం: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ కాంట్రాక్టు కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని కొండల ప్రాంతంలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలను పెట్టేందుకు ప్రైవేటు కాంట్రాక్టర్ తమ కూలీలను తీసుకువచ్చారు. దీనిలో భాగంగా అన్నాపురంలో ఇటీవల స్థానికంగా ఉన్న జేసీబీ ఢీ కొట్టడంతో విరిగిపోయిన స్తంభాన్ని పాతిపెట్టి తర్వాత హర్షబడ పంచాయతీలో మరికొన్ని స్తంభాలు ఏర్పాటుచేశారు. ఈ సమయంలో లైన్ ఇన్‌స్పెక్టర్ ఎల్‌సీ ఇచ్చి స్తంభాలు వేయించారు. అయితే రామకృష్ణాపురం వద్ద ఉన్న ఒక క్వారీ వద్ద లైన్ ఏర్పాటుకు స్థానిక జేఎల్‌ఎం షణ్ముఖరావు ఎలాంటి ఎల్‌సీ తీసుకోకుండా, లైన్ ఇన్‌స్పెక్టర్‌కు తెలుపకుండా పని మొదలుపెట్టారు. సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడు పేటకు చెందిన పరపటి తమ్మయ్యను తీసుకొని వెళ్లి స్తంభం ఎక్కించారు. దీంతో విద్యుత్ వైరును తాకగానే షాక్ తగిలి ఎడమ చేయి, వీపుపై కొంత భాగం కాలిపోయింది. దీంతో హుటాహుటిన టెక్కలి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి రిమ్స్‌కు తీసుకెళ్లారు. దీనిపై ఆ శాఖ అధికారులు సమాచారం ఇచ్చేందుకు స్పందించలేదు.

బారులుతీరిన జనం



ఆర్‌బీఐ శాఖా కార్యాలయం ముందు క్యూలో ఉన్న ప్రజలు

భువనేశ్వర్: బ్యాంకు శాఖల్లో రూ.2,000 కరెన్సీ నోట్లను మార్చుకోవడానికి అక్టోబర్ 7తో గడువు ముగిసింది. దీంతో స్థానిక భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శాఖ ఆవరణలో మంగళవారం నోట్లు మార్చుకోవడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు బారులుతీరారు. వారిలో అత్యధికులు రూ.2,000 నుంచి గరిష్ఠ మారకపు పరిమితి రూ.20,000 వరకు జమ చేసేందుకు విచ్చేసినట్లు తెలిసింది. అయితే ఈ పరిస్థితి పలు అనుమానాలకు దారి తీస్తోంది. కొంతమంది రూ.200 నుంచి రూ.300 వరకు కమీషన్ వస్తుందనే ఆశతో వీటిని మారుస్తున్నట్లు తెలుస్తోంది. దీని వెనక ఉన్న వారి వివరాలు తమకు తెలియదని దాటవేస్తున్నారు. దీంతో నల్లధనం ఇలా రంగు మార్చుకుంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సమాచారం లేదు

నోట్లను మార్చుకోవడానికి విచ్చేస్తున్న వారికి సంబంధించి తమకు ఎటువంటి సమాచారం లేదని ఆర్‌బీఐ భువనేశ్వర్ ప్రాంతీయ డైరెక్టర్ శారదా ప్రసన్న మహంతి పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారం నోట్ల మార్పిడి కోసం ఆర్‌బీఐకి వచ్చేవారికి అవసరమైన గుర్తింపు పత్రాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇది కాకుండా మార్చుకోవడానికి కౌంటర్ల ప్రాంగణంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు ప్రతిరోజూ ఆర్‌బీఐకి రూ.2 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు వస్తున్నాయన్నారు. బ్యాంకు ఖాతాల్లో రూ.2,000 నోట్లను మార్చుకోవడానికి లేదా డిపాజిట్ చేయడానికి విచ్చేసే వారి కోసం దాదాపు 250 మంది వ్యక్తుల కోసం ఈ ప్రాంగణంలో తాగునీరు మరియు ఇతర మౌలిక సౌకర్యాలను కల్పించినట్లు వివరించారు.

పేదల ఆశాజ్యోతి ఇందిరా గాంధీ



పర్లాకిమిడి: ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జయపురం: ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



బరంపురం: ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

జయపురం: పేదల ఆశాజ్యోతి దివంగత ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ అని పలువురు కాంగ్రెస్ నేతలు అన్నారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదరిక నిర్మూలనకు ఆమె తీసుకొచ్చిన పథకాలు గొప్పవని పేర్కొన్నారు. దేశానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బినోద్ మహాపాత్రో, కొరాపుట్ జిల్లా మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు హసన్ మదాని తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: దివంగత ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా గజపతి జిల్లా కాంగ్రెస్ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు బసంత పండా, అభిమన్యు పండా, సురేష్ మఝి, త్రినాథ పాత్రో, లోకి పాత్రో తదితరులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి, కాంగ్రెస్ పార్టీ ఆమె చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు.

బరంపురం: నేటి సమాజానికి ఇందిరా గాంధీ ఆదర్శనీయురాలని డీసీసీ అధ్యక్షుడు త్రినాథ్ బెహరా అన్నారు. స్థానిక గాంధీ నగర్ మెయిన్ రోడ్డులోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పాత బస్టాండ్ ప్రాంగణంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి పితావాసి పండా, పీసీసీ కార్యదర్శి ప్రమోద్ కుమార్ జెనా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు సమస్యలు వివరిస్తున్న దృశ్యం

పోలాకి: తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు మినీ అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న టీచర్ కమ్ హెల్పర్లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మబగాంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. రూ.7 వేల వేతనంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం అందటం లేదన్నా రు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలకు తమను అర్హులుగా గుర్తించాలని కోరారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

'సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు'



సమావేశంలో మాట్లాడుతున్న పిట్ట చంద్రపతిరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీ కులగణన చేయాలన్న నిర్ణయాన్ని స్వాగతించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు అన్నారు. కులగణన చేసేందుకు కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల్, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం నగరంలో ఎన్జీఓ హోమ్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రపతి మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన విశాఖపట్నం, పబ్లిక్ లైబ్రరీ, సీతంపేటలో జరిగే ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ సంక్షేమ సంఘ సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. అలాగే సంఘం శ్రీకాకుళం జిల్లా యువజన అధ్యక్షుడిగా పులారీ దుర్యోధనరావు, జిల్లా ప్రచార కార్యదర్శిగా తుమ్మిడి గంగాధర్‌రావు, శ్రీకాకుళం పట్టణ కార్యదర్శిగా ఉజరావు రవిశంకర్‌ను నియమించినట్లు తెలిపారు.

సమావేశంలో బాడాన దేవభూషణరావు, పిట్టా భాగ్యచంద్ర యాదవ్, అమిరుల్లా బేగ్, మంగరాజు, కుప్పిలి సూర్యరావు, కోరాడ అప్పారావు, పాలిన శ్రీనివాసరావు, జంజాలూరి రామారావు, తిప్పాన గాంధీ, దామోదర కేశవ, కాళ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీల తేదీలు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యంలో జరిగే గ్రిగ్స్‌మీట్ పోటీల తేదీలు ఖరారయ్యాయి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ఉపవిద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావులు షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ షెడ్యూల్‌లో భాగంగా నవంబర్ 4 నుంచి 8వ తేదీలోపు మండల స్థాయి, నవంబర్ 27 నుంచి 30వ తేదీల్లో జోనల్ స్థాయి పోటీలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయి గ్రిగ్స్ పోటీలను డిసెంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సన్నద్ధత కోసం గురువారం ఉదయం 10 గంటల నుంచి మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఆయా మండలాల్లో ఉన్న హెచ్‌ఎంలు, పీడీ/పీఈటీలతో విధిగా సమావేశాలను నిర్వహించాలని డీఈఓ వెంకటేశ్వరరావు సూచించారు.

క్లుప్తంగా

రైలు ప్రమాద మృతుడి ఆచూకీ లభ్యం

• కర్నూలుకు చెందిన తాయప్పగా గుర్తింపు


మృతుడు తాయప్ప (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: కంటకాపల్లి, అలమండ మధ్య జరిగిన రైలు ప్రమాదంలో 13 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందులో 12 మృతదేహాలకు పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఒక మృత దేహం ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోస్టుమార్టం నిర్వహించలేదు. మంగళవారం వారి బంధువులు వచ్చారు. మృతుడిది కర్నూలు జిల్లా కోశిక మండలం అగస నూరుగా చెందిన చాకలి తాయప్ప (21)గా గుర్తించారు. దీంతో రైల్వే పోలీసులు పోస్టు మార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

బైక్‌ల ఢీ

• యువకుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన ఉపేంద్రకు ఘటనా స్థలంలో సపర్యలు చేస్తున్న స్థానికులు

కొత్తవలస: మండలంలోని అరుకు – విశాఖ అంతర్ రాష్ట్ర రోడ్డులో నిమ్మలపాలెం జంక్షన్ సమీపంలో మంగళవారం ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎస్.కోట మండల కేంద్రం శ్రీనివాసనగర్‌కు చెందిన ఎ.ఉపేంద్ర తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా వున్నాయి. క్షతగాత్రుడు ఉపేంద్ర తన బైక్‌పై ఎస్.కోట నుంచి కొత్తవలస వైపు వస్తుండగా కొత్తవలస వైపు నుంచి ఎస్.కోట వైపు వెళ్తున్న మరో బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేంద్ర తుళ్లి పక్కన ఉన్న తుప్పల్లో పడిపోయాడు. ప్రమాదానికి కారణమైన మరొక యువకుడు బైక్‌పై అక్కడ నుంచి పరారయ్యాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు క్షతగాత్రుడికి సపర్యాలు చేసి 108 వాహనంలో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

ఐఈఆర్పీ పోస్టుల ఎంపిక తుది జాబితా విడుదల

• నేడు అభ్యర్థులకు కౌన్సెలింగ్

విజయనగరం అర్బన్: సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఐఈఆర్పీ పోస్టుల కోసం ఇటీవల నిర్వహించిన నియామక ప్రక్రియ ద్వారా ఎంపికైన అభ్యర్థుల జాబితాను డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి మంగళవారం విడుదల చేసారు. జాబితాను 'డీఈఓ విజయనగరం' వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. కాంట్రాక్ట్ విధానంలో భర్తీ నోటిఫికేషన్ మేరకు వివిధ స్థాయిలో ఎంపిక చేపట్టిన విషయం తెలిసిందే. తుది జాబితాలో ఎంపికైన అభ్యర్థులకు బుధవారం స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

హౌస్‌సర్జన్‌పై దాడి

విజయనగరం క్రైమ్: కేంద్రాస్పత్రిలో హౌస్ సర్జన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కేంద్రాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్జన్ సువర్ణకుమార్ ఆపరేషన్ థియేటర్‌లో సర్జరీ చేస్తున్నారు. అతని వద్దకు లక్ష్మణ అనే రోగి ట్రీట్మెంట్ చేయించుకోవడానికి వచ్చారు. అతనితో పాటూ తొమ్మిది మంది గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. పలుమార్లు ఆపరేషన్ థియేటర్‌లోకి వచ్చి అంతరాయం కల్గించడంతో కాసేపు వెలుపల ఉండాలని చెప్పడంతో వాగ్వివాదానికి దిగారు. దీంతో పక్కన ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు వైద్యుడిపై చేయిచేసుకున్నారు. వెంటనే అతను వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఈబీ స్పెషల్ డ్రైవ్


వాహనాలు తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

విజయనగరం క్రైమ్: పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు ఆదేశాలతో ఇతర ప్రదేశాల నుంచి మద్యం, సారా, గంజాయి విజయనగరంలోనికి రాకుండా పోలీసులు నిఘా పెట్టారు. నగరంలోని వై జంక్షన్, గంట్యాడ రోడ్డు, గొట్లాం రోడ్డు, జమ్ము జంక్షన్, సారిపల్లి జంక్షన్‌ల వద్ద మంగళవారం చెక్ పాయింట్లను ఏర్పాటుచేసి తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ తెలిపారు. ఎస్ఈబీ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శైలజారాణి ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు.

సీఎం జగన్ మానవత్వం చాటుకున్నారు...


క్షతగాత్రులకు చెక్కులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి

• రైలు ప్రమాద క్షతగాత్రులకు ప్రకటించిన దాని కంటే ఎక్కువ పరిహారం అందజేత
• మృతులు, క్షతగాత్రులకు రూ.2.59 కోట్ల పరిహారాన్ని అందిస్తున్నాం..
• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
• సర్వజన ఆస్పత్రిలో క్షతగాత్రులకు చెక్కుల అందజేత

విజయనగరం ఫోర్ట్: రైలు ప్రమాద క్షతగాత్రుల పట్ల సీఎం మానవత్వం చాటుకుని, పరిహారం పెంచారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. రైలు ప్రమాదంలో గాయపడ్డ వారికి రూ.1.02 కోట్ల చెక్కులను స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం ఆయన అందజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి బాధితుని వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన పరిహారాన్ని అందజేస్తున్నామని చెప్పారు. పూర్తిగా కోలుకున్న తర్వాతనే వైద్యుల సలహా మేరకు ఇంటికి వెళ్లాలని సూచించారు. మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించాలని ముఖ్యమంత్రిగారే స్వయంగా చెప్పారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తిగా కోలుకునే వరకు మందులను వాడి ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన జిల్లా పర్యటనలో రైలు ప్రమాద దుర్ఘటనలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను, వారి బాధను విని చలించిపోయారని తెలిపారు. తొలిత క్షతగాత్రులకు రూ.2 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ ప్రత్యక్షంగా బాధితులను, వారి బాధలను చూసిన మీదట గాయాలను బట్టి 3 కేటగిరీలుగా చేసి పరిహారం మొత్తాన్ని పెంచారని తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ.10 లక్షల పరిహారం, శాశ్వత అంగ వైకల్యం పొందిన వారికి రూ.10 లక్షల పరిహారం ప్రకటించారని, అదేవిధంగా గాయపడ్డ వారిలో నెలరోజుల్లోపు కోలుకొని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వారికి రూ.2 లక్షలు ఇవ్వాలని ఆదేశించారన్నారు. నెల రోజులకు పైగా ఆస్పత్రిలో ఉంచి వైద్యం అందించాల్సిన అవసరం ఉన్న వారికి రూ.5లక్షల పరిహారాన్ని, అందించాలని చెప్పారని తెలిపారు. ఈ విధంగా జిల్లాలో 3వ కేటగిరి కింద రూ.10 లక్షల పరిహారానికి అర్హత గల ముగ్గురిని, 2వ కేటగిరికి కింద రూ.5 లక్షల పరిహారానికి 15 మందిని, ఒకటో కేటగిరి కింద రూ.2 లక్షల పరిహారానికి 12 మందిని ఎంపిక చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిలా సునందిని, ఆర్ఎంఓ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

• ఎంపీ బెల్లాన చంద్రశేఖర్
• రైలు ప్రమాద క్షతగాత్రులకు పరామర్శ


జి.సిగడాంకు చెందిన రాములమ్మతో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం ఫోర్ట్: రైలు ప్రమాద క్షతగాత్రులకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఏ ఒక్కరు అధైర్య పడొద్దని విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కంటకాపల్లి రైలు ప్రమాద క్షతగాత్రులను మంగళవారం ఆయన పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలు గురించి ఆస్పత్రి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, వైద్యులు డాక్టర్ పి.ఏ.రమణి, డాక్టర్ సంబంగి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మా బాధను చూసి జగన్ చలించిపోయారు..



సోమవారం నన్ను ఆస్పత్రిలో సీఎం జగన్ పరామర్శించారు. ఎక్కడెక్కడ దెబ్బలు తగిలాయని అడిగారు. ఆరోగ్యం బాగుందా అని అడిగారు. నా కూతురు లక్ష్మి రైలు ప్రమాదంలో చనిపోయిందని చెప్పాను. దీంతో ఆయన చలించిపోయారు. అన్ని విధలా అండగా ఉంటానని చెప్పారు. ప్రమాదంలో నా కాలు విరిగింది. రూ.10 లక్షల చెక్కును చిన్నశ్రీనుగారు, కలెక్టర్ అమ్మ అందించారు. సీఎం గారు చేసిన మేలును మరవలేం.

– కీర్తి రాములమ్మ, జి.సిగడాం, శ్రీకాకుళం జిల్లా

పరిహారం తక్షణమే ఇవ్వడం ఆనందంగా ఉంది



సీఎం జగన్‌గారు పరామర్శించి వెళ్లిన మరుసటి రోజే పరిహారం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఇంత త్వరగా ఇస్తారని అనుకోలేదు. తగ్గేంత వరకు వైద్యం చేయిస్తామని సీఎం చెప్పారు. రూ.5లక్షలు చెక్కు ఇచ్చారు.

– మర్రాపు సూర్యనారాయణ, పణుకువలస గ్రామం, బలిజిపేట మండలం

సీఎం జగన్‌గారు స్పందించిన తీరు అభినందనీయం



రైలు ప్రమాద సంఘటన జరగ్గానే సీఎం జగన్‌గారు స్పందించిన తీరు అభినందనీయం. మమ్మల్ని పరామర్శించిన వెంటనే చెక్కులు అందజేయడం ఆనందంగా ఉంది. ఏం భరోసా కావాలన్నా సీఎం గారు ఇస్తామని చెప్పారు.

– ఎస్.మిశ్రా, పలాస, శ్రీకాకుళం జిల్లా

విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రాజెక్ట్‌లు


జ్ఞాపికలు అందజేస్తున్న డిప్యూటీ ఈఓలు వాసుదేవరావు, బ్రహ్మాజీరావు

విజయనగరం అర్బన్: విజయనగరం ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలను మంగళవారం విద్యా శాఖ ప్రకటించింది. ప్రదర్శనలో జిల్లాలోని వివిధ ప్రాంతాల పాఠశాలల నుంచి 11, జూనియర్ కళాశాలల నుంచి 10, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 4 ప్రాజెక్ట్‌లు ప్రదర్శనలో పాల్గొన్నాయి. వీటిలో ఉత్తమమైన 11 ప్రాజెక్ట్‌లను ఎంపిక చేసిన వారికి ప్రశంసాపత్రం, జ్ఞాపికలను డిప్యూటీ ఈఓ వాసుదేవరావు, బ్రహ్మాజీరావు అందజేసారు. ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికైన వాటిలో రామతీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఫోర్ట్ సిటీ స్కూల్ విజయనగరం, రెల్లివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహరాజా ఉన్నత పాఠశాల విజయనగరం, కొత్తవలస ఎంపీయూపీ స్కూల్, నెల్లిమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఎంఆర్ పీఆర్‌సీ ఉన్నత పాఠశాల విజయనగరం, భాష్యం హైస్కూల్ విజయనగరం ప్రాజెక్టులు ఉన్నాయి.

ఇద్దరు క్షతగాత్రుల డిశ్చార్జ్

మహారాణిపేట (విశాఖపట్నం): విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో గాయపడిన వారిలో ఇద్దర్నీ మంగళవారం డిశ్చార్జ్ చేశారు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సింగుపురం గ్రామానికి చెందిన మోహిద వరలక్ష్మి, నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన గొట్ట కమలమ్మను మంగళవారం డిశ్చార్జ్ చేశామన్నారు. విజయనగరం జిల్లా జామి మండలానికి చెందిన నల్ల కుమారి, గాజువాక దయాల్‌నగర్ ప్రాంతానికి చెందిన ముద్రు లక్ష్మికి శస్త్ర చికిత్స నిర్వహించామని, ప్రస్తుతం వారి పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు


ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి తమలపాకులు, సింధూరంతో ప్రత్యేక అర్చనలు చేపట్టి హనుమాన్ చాలీసా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం సుందరాకాండ పారాయణాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. లోక కల్యాణార్థం జిల్లాకు చెందిన పలువురు భక్తులు 108 ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సుందరాకాండ పారాయణాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారంతా రామతీర్థంలో పారాయణాలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న ఎస్ఈబీ అధికారులు

వంగర: మండలంలోని శివ్వాం గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్ఈబీ సీఐ శ్రీధర్ ఆదేశాల మేరకు దాడిచేసి పట్టుకున్నామని ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు చెప్పారు.

ప్రజారోగ్యానికి భరోసా..

• నేడు జిల్లాలో మూడు చోట్ల వైద్య శిబిరాలు
• డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పార్వతీపురం టౌన్:

ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తూ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. మంగళవారం పార్వతీపురం మండలం ములగ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సమస్యలతో వచ్చిన వారందరికీ మందులను పూర్తి స్థాయిలో అందజేస్తున్నామన్నారు. రిఫరల్ అవసరమైన వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రికి పంపుతున్నామన్నారు. పిల్లల్లో పుట్టుక లోపాలు గుర్తించడం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు జిల్లాలో 3 చోట్ల వైద్య శిబిరాలు	
పీహెచ్‌సీ	శిబిరం నిర్వహించే ప్రదేశం
బాలేరు	సీతంపేట-1 ప్రభుత్వ పాఠశాల
సూరంపేట	సూరంపేట, ఎంపీపీ స్కూల్
తాడికొండ	కొండవాడ, గ్రామ సచివాలయం

డ్యూటీ డాక్టర్‌పై దాడి చేసిన రోగి బంధువు


జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న బాధితుడు డాక్టర్ రాజు

• జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన వైద్యులు
• సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ గోవిందరావును ఆదేశించిన జెడ్పీ చైర్మన్


డాక్టర్‌పై దాడి చేసిన వ్యక్తి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డ్యూటీ డాక్టర్‌పై రోగి బంధువు దాడి చేసాడు. దీంతో సదరు వ్యక్తిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి విధుల్లో ఉన్న ఓ మహిళ వైద్యురాలి పట్ల రోగి బంధువు ఒకరు అసభ్యకరంగా ప్రవర్తించాడు. మహిళ వైద్యురాలి పట్ల ఎందుకు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విధులు నిర్వర్తిస్తున్న మరో వైద్యుడు పి.రాజు రోగి బంధువును ప్రశ్నించారు. దీంతో సదరు వ్యక్తి డాక్టర్‌పై దాడి చేసి కొట్టాడు. మిగతా వైద్య సిబ్బంది, సెక్యూరిటీ వచ్చి పట్టుకోవడానికి ప్రయత్నించేలోగా రోగితో దాడి చేసిన వ్యక్తి ఏపీ 39ఆర్ఎస్ 3581 ఎరుపు రంగు షిఫ్ట్ కారులో పారిపోయారు. మంగళవారం సర్వజన ఆస్పత్రికి వచ్చిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి ఈ విషయం వైద్యులు తీసుకెళ్లారు. అవుట్ పోస్టు పోలీసులకు దాడి చేసిన విషయాన్ని చెప్పిన పట్టించుకోలేదని వారు తెలిపారు. వెంటనే డీఎస్పీ గోవిందరావును పిలిపించి సాయంత్రంలోగా డాక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. రవాణ శాఖ అధికారులతో మాట్లాడి దాడి చేసిన వ్యక్తి చిరునామా తెలుసుకోవాలని చెప్పారు. అవుట్ పోస్టు పోలీసులు ఎందుకు ఫిర్యాదు తీసుకోలేదో విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్‌సీఎస్ కర్మాగారాన్ని తెరిపించాలి : సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సీతానగరం: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగాన్ని ప్రభుత్వం తెరిపించాలని తద్వారా రైతులను, కార్మికులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.వేణు ఆధ్వర్యంలో చినబోగిలిలో మంగళవారం నిర్వహించిన ప్రజారక్షణ భేరి రాష్ట్ర బస్సుయాత్ర సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాధీనంలో ఉన్న చక్కెర కర్మాగారాన్ని చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు పరం చేసిందని ఆరోపించారు. రైతుల ఆర్థికాభివృద్ధికి చెరకు కర్మాగారంలో క్రషింగ్ చేసి రైతు, కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి ఎన్‌సీఎస్ కర్మాగారాన్ని తెరిపించాలని కోరారు. ఆ పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధాలకు నిరసనగా నవంబరు 15న విజయవాడలో జరగనున్న ప్రజాగర్జన సదస్సుకు హాజరుకావాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మర్రాపు సూర్యనారాయణ, జిల్లా నాయకుడు ఆర్.లక్ష్మున్నాయుడు అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా నాయకులు గంట జ్యోతి, ఐద్వా జిల్లా కార్యదర్శి వి.రామలక్ష్మి పాల్గొన్నారు.

డ్వాక్రా బజార్‌కు జాతర తాకిడి

• మూడు రోజుల్లో డ్వాక్రా బజార్ వ్యాపారం రూ.1.4 కోట్లు
• హస్తకళలు, వస్త్రాలు, అలంకార వస్తుల స్టాల్స్ రద్దీ


సందర్శకుల తాకిడిలో అఖిల భారత స్థాయి డ్వాక్రా బజార్

విజయనగరం అర్బన్: అఖిల భారత డ్వాక్రా బజార్ పేరుతో స్థానిక ట్యాంక్ బండ్ రోడ్డును ఆనుకొని మాన్సాస్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మహిళా సంఘాల ఉత్పత్తి ప్రదర్శన, విక్రయాలశాలలకు పైడితల్లి అమ్మవారి జాతరతో కొనుగోలుదారుల తాకిడి పెరిగింది. మంగళవారం సిరిమానోత్సవం కారణంగా జాతరకు వచ్చిన భక్తులకు డ్వాక్రా బజార్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జాతరకు వచ్చిన ప్రతి ఒక్కరూ డ్వాక్రా బజార్ సందర్శన చేసారు. దీంతో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సరస్ (సేల్స్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిషన్ సొసైటీ) పరిధిలో నిర్వహిస్తున్న ఈ బజార్‌పై రద్దీ పెరిగి మూడు రోజుల్లో రూ.1.45 కోట్ల విక్రయాలు జరిగాయి. ప్రధానంగా హ్యాండీ క్రాఫ్ట్ ఉత్పత్తులు విక్రయాలు అధికంగా జరిగాయి. మరోవైపు సందర్శకుల పిల్లలను ఆహ్లాదపరిచేందుకు ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్‌చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు పర్యవేక్షణలో ఈ ప్రదర్శన వచ్చే నెల 8వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

• 8వ తరగతి విద్యార్థి మృతి
• బయటపడ్డ మరో విద్యార్థి
• విద్యార్థిని కాపాడిన స్వామి


విద్యార్థులను ఒడ్డుకు చేర్చిన యశ్వంత్


కోనేరులో మునిగి చనిపోయిన విద్యార్థి సాయి

శృంగవరపుకోట: సెలవు రోజు ఈత కోసమని వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయి కన్నవారికి గర్భశోకాన్ని మిగిల్చాడు ఆ విద్యార్థి. విజయనగరం పైడితల్లమ్మ ఉత్సవం కావటంతో మంగళవారం పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దీంతో ధర్మవరం గ్రామానికి చెందిన నలుగురు స్కూలు విద్యార్థులు కలిసి వేములాపల్లి శివాలయం సమీపంలోని కోనేరుకు ఈతకు వెళ్లారు. ఇద్దరు ఒడ్డున కూర్చోగా చప్ప సాయి, ముని జయచరణ్‌తో కలిసి కోనేరులోకి ఈతకు దిగారు. ఈత కొడుతున్న సమయంలో మరికాస్త ముందుకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మునిగిపోయారు. దీంతో ఒడ్డున ఉన్న మరో ఇద్దరు స్నేహితులు కేకలు వేయటంతో దగ్గరలో ఉన్న వేములాపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారి లగుడు యశ్వంత్ కోనేరులో దూకి ఒకరిని ఒడ్డుకు చేర్చాడు. ఈ కేకలకు చుట్టు పక్కల పొలాల్లోని మహిళలు వచ్చి సపర్యలు చేస్తుండగా, మరో స్నేహితుడు లోపలే మునిగి పోయాడని చెప్పడంతో యశ్వంత్ మళ్లీ కోనేరులోకి దూకి రెండవ విద్యార్థిని ఒడ్డుకు చేర్చాడు. వీరిద్దరినీ ప్రైవేటు వాహనంలో ఎస్.కోట ఆస్పత్రికి తరలించే క్రమంలో చప్ప సాయి (14) మృతి చెందాడు. జయచరణ్‌కు ప్రాథమిక చికిత్స చేసి, ఊపిరితిత్తుల్లోకి నీరు చేరిందని మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. ఈ ఘటన గ్రామాన్ని విషాదంలోకి నెట్టింది. ఎస్.కోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే ఒక్కడు..

గంట్యాడ మండలం పెంటశ్రీరాంపురం గ్రామానికి చెందిన రామారావుకు కొన్నేళ్ల క్రితం ధర్మవరం గ్రామానికి చెందిన కోటలక్ష్మితో వివాహం జరిగింది. వీరికి చాలా సంవత్సరాలు సంతానం లేక తర్వాత సాయి పుట్టాడు. ఒక్కడే కావటంతో ముద్దుగా పెంచుకున్నారు. ఇటీవల వీరిద్దరికీ తిరుపతి సమీపంలో నాయుడుపేట వద్ద ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు రావటంతో కోటలక్ష్మి తన కుమారుడిని ఎస్.కోటలో ఓ ప్రైవేటు స్కూల్‌లో చేర్పించి, తన పుట్టింటి దగ్గర ఉంచింది. దీంతో మృతుడు సాయి ధర్మవరం కొత్తవీధిలో తన తాత పెంట సూర్యనారాయణ ఇంటి వద్ద ఉంటూ ఎస్.కోట పట్టణంలోని ప్రైవేటు స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. సాయి మరణంతో తాత, అవ్వలు గుండెలు బాదుకుంటూ 'ఇప్పుడు మీ అమ్మానాన్నలకి మేము ఏం సమాధానం చెప్పాలి సాయి... మీ అమ్మా నాన్న కష్టం ఎవరి కోసం.. ఎందుకు వదిలి పోయావురా... ఈ వయసులో మాకీ కష్టం ఎందుకురా' అంటూ రోదించిన తీరు చూపరులకు కంటతడి పెట్టించింది.

22న పూజాసామగ్రి విక్రయానికి వేలం

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయంలో భక్తులకు విక్రయించే పూజాసామగ్రికి సంబంధించి ఈ నెల 22న బహిరంగ వేలం వేయనున్నామని ఈఓ బీవీ మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపాలు, ఫొటోలు, రక్షలు, పూజాద్రవ్యాలు, కొబ్బరి చెక్కలు వసూలు చేసుకునే హక్కుతో పాటు అమ్మవారికి సమర్పించే చీరలు, జాకెట్ తదితరాలు విక్రయించేందుకుగాను ఈ వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. పాట దక్కించుకున్న వారికి ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 2025 నవంబర్ 30 వరకు హక్కు ఉంటుందని వెల్లడించారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు ఆలయం వద్దకు చేరుకోవాలని సూచించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాకచర్ల దుర్గా ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సారిపల్లిలో పైడిమాంబ ఉత్సవాలు


ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో శ్రీపైడితల్లమ్మ ఉత్సవాలను గ్రామస్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విజయనగరం శ్రీపైడిమాంబ ఉత్సవాల సమయంలో గ్రామంలో కూడా అమ్మవారికి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. మహిళలు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పైడితల్లి పండగ సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది.